# ది గెస్ట్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



## THE STORY OF A MAN, A WOMEN AND A CHILD

*( ప్రథమ ప్రచురణ - నవంబర్, 1988)*

## (గత సంచిక తరువాయి)

మైత్రి మళ్ళీ తనకి అంత త్వరగా తారసపడుతుందనుకోలేదు బెనర్జీ. ఆ శనివారం విశ్వం బెనర్జీ గదిలోకి వచ్చి చెప్పాడు ఉత్సాహంగా.

"మనకో గుడ్ న్యూస్ గురూ"

"మనం అప్లయ్ చేసిన లైసెన్స్‌ని ప్రభుత్వం మంజూరు చేసిందా?" అడిగాడు బెనర్జీ.

"మనకి అంటే నా ఉద్దేశం నీకని. అదికాదు."

"ఇంకేమిటయితే? పేకింగ్ సెక్షన్ లోని.."

"ఆ బాపతే కాని అదికాదు."

తన మిత్రుడి వంక ప్రశ్నార్థకంగా చూసాడు బెనర్జీ.

"రేపు ఆదివారం కదా. నెహ్రూ జూ పార్క్‌లో నీకో పసందయిన కనుల విందుంది. స్నేహ గుర్తుంది కదా?"

"స్నేహా?"

"నల్లగులాబి గురూ"

"మైత్రా?"

"ఎగ్జాట్లీ. ఆ అమ్మాయిని రేపు నువ్వు మరోసారి కలుసుకోవచ్చు."

"ఎలా?"

ఆ ప్రశ్న అడుగుతుంటే బెనర్జీ మొహంలోకి కొత్త వెలుగు ప్రవేశించింది.

"నా కజిన్ గాయత్రి, మైత్రి ఫ్రెండ్స్ అని తెలిసింది. రేపు ఉదయం పన్నెండుమంది నెహ్రూ జూ పార్క్‌కి పిక్‌నిక్‌కి వెళుతున్నారు. నువ్వూ వాళ్ళలో ఉంటే మైత్రిని ఆకట్టుకునే అవకాశం ఉన్నట్లే."

"అలాగా? నేనెలా వాళ్ళతో జాయిన్ కావడం?"

"అది నేను ఏర్పాటు చేసాను. కాలేజ్‌లో ఎన్.సి.సి.లో ఆ పన్నెండుమంది క్లోజ్. వాళ్ళలో ఒకతని పుట్టిన రోజట రేపు. అందుకని కలుస్తున్నారు!"

మర్నాడు ఉదయం బెనర్జీ కారుతో నెహ్రూ జూ పార్క్‌కి చేరుకున్నాడు గాయత్రి, విశ్వంలతో.

"నేను అన్ ఇన్‌వైటెడ్ గెస్ట్‌గా వస్తున్నాను. మీ ఫ్రెండ్సేం అనుకోరు కదా?" దారిలో అడిగాడు బెనర్జీ గాయత్రిని.

"ఏం అనుకోరు" చెప్పింది.

బెనర్జీకి అందర్నీ పరిచయం చేసింది గాయత్రి. మైత్రిని కూడా. మైత్రి అప్పుడే మొదటిసారి చూసినట్లుగా నమస్కారం చేసింది.

ఆ రోజు ఓ ఇన్‌కంటేక్స్ ఆఫీసర్ కొడుకు బర్త్‌డే అంతా ఎవరిళ్ళనుంచి వాళ్ళు రకరకాల పదార్థాలు వండి తెచ్చారు. ఒకరు అన్నం, మరొకరు పెరుగు, ఇంకొకరు పచ్చడి, కొందరు కూరలు ఇలా.

జూ అంతా గంటలో తిరిగాక అంతా చెట్ల నీడలో ఓ చోట గుండ్రంగా కూర్చున్నారు.

"భోజనానికి ఇంకో అరగంట టైం ఉంది. ఈలోగా అంతా తలో జోక్ చెప్పాలి" ప్రపోజ్ చేసింది గాయత్రి.

మొదటి జోక్ గాయత్రే చెప్పింది. తర్వాత చెప్పిన వాళ్ళలో కొందరు నవ్వొచ్చే జోక్స్ చెపితే, కొందరు మామూలు జోక్స్ చెప్పారు.

"మీరు మీకు తోచింది చెప్పండి" అడిగింది గాయత్రి బెనర్జీని.

"నాకు పెద్దగా జోక్స్ ఏమీరావండి"

"పోనీ చిన్నగా చెప్పండి"

అంతా నవ్వారు.

"చెప్పాల్సిందే" కొందరు బలవంతం చేసారు.

విశ్వానికి తెలుసు బెనర్జికి సెన్సాఫ్ హ్యూమర్ లేదని. జోక్ చెప్పలేడని గ్రహించి తనే చెప్పాడు.

"గురూ! మొన్న గురువారం నాకు నువ్వు చెప్పావే? ఆ జోక్ నీ తరపున నేను చెప్పనా?"

"గురువారమా?"

"అవును.. ఇది మీరంతా విన్నదే అయివుంటే ముందే సారీ! ఓ భర్త ఆఫీసులో ఎంతో దిగులుగా కూర్చుని ఉంటటం అతనితో పనిచేసే మరొకతని కారణం అడిగాడు. 'ఏం లేదు మా ఆవిడా నేనూ పోట్లాడుకున్నాం నెలరోజులు నాతో మాట్లాడనని భీష్మించుకుని కూర్చుంది' అని చెప్పాడు భర్త. 'అరెరె! ఎందుకు దిగులు? నా భార్య అలా అంటే సంతోషపడేవాడిని' అని మిత్రుడు అన్నాడు. అందుకా భర్త 'నిజమే! కాని ఇవాళ నెలలో ఆఖరి రోజు' అన్నాడు."

అంతా నవ్వారు.

మైత్రి పొరపాటున కూడా తన వంక చూడటం లేదని గుర్తించాడు బెనర్జీ. అంతటి పట్టుదలగల మనిషి అతనికి కొత్తే.

విశ్వం సర్వవిధాలా ప్రయత్నించాడు వాళ్ళిద్దర్నీ కలపాలని.

"మనం పార్టీగేమ్ ఆడకుండా భోజనానికి కూర్చోవటం బాలేదు" చెప్పాడు.

అంతా అతనివంక ప్రశ్నార్థకంగా చూసారు.

"ఇది అందరికీ తెలిసిన సింపుల్ గేమ్. కాగితం ముక్కలమీద రకరకాల విషయాలు రాస్తాం. పాడాలి లేదా ఏడవాలి ఎట్సెట్రా. " పధ్నాలుగు కాగితాలు కట్ చేసి అందరికీ తలొకటి పంచింది గాయత్రి.

"ఢిల్లీ వెళ్ళిరావాలి, అందరికీ తలో వందరూపాయలు ఇవ్వాలిలాంటి ఇబ్బందికరమయినవి కాక, ఎదుటి వాళ్ళని నవ్వించేవి రాయాలి. ఇందాక విశ్వంగారు చెప్పినలాంటివి" ఓ అమ్మాయి సన్నటి గొంతుతో చెప్పింది.

"అవును. అలాంటివే" సమర్థించారు ఇద్దరు.

"గుడ్. ప్రొసీడ్" చెప్పాడు పుట్టిన రోజు పార్టీ చేసుకునే వ్యక్తి.

అంతా రాసాక వాటిని నాలుగు మడతలు చేసి ఓ స్టీలు గిన్నెలో వేసారు. వాటిని గాయత్రి కలిపి ఒకటి తీసుకుని తన పక్కనున్న వ్యక్తికి ఇచ్చిందా గిన్నెని. ఆమె గిన్నెలోంచి మడిచిన కాగితాల్లోంచి ఒకటి తీసుకుని తన పక్కవాళ్ళకి గిన్నెని ఇచ్చింది. నిమిషం తిరక్కుండానే గిన్నె పధ్నాలుగు మంది చేతులు మారి, లోపల కాగితాలు ఖాళీ అయాయి.

"ఇప్పుడు భోజనాలు ప్లస్ ప్లేట్స్‌లో వడ్డించారు. తినడం ప్రారంభించాక "అల్ఫా బెటికల్ ఆర్డర్‌లో. ఏ అక్షరం పేరు మొదలయ్యేవాళ్ళు మొదట విప్పండి" చెప్పాడు విశ్వం.

అనిత తనకి వచ్చిన కాగితం నాలుగు మడతలు విప్పి చదివి చిన్నగా నవ్వింది.

"బయటకి చెప్పాలి" చెప్పింది గాయత్రి.

"మీరు మొగయితే ఆడగొంతుతో, ఆడయితే మొగగొంతుతో పాటపాడాలి."

"అది రాసింది నేనే" ఒకరు ఉత్సాహంగా చెప్పారు.

"పాడమ్మా మొగరాయడా" చెప్పారు మరొకరు.

ఆమె 'వివాహ భోజనంబు. వింతైన వంటకంబు' పాట పల్లవిని, గుర్తున్న చరణాలని మగ గొంతుకతో పాడుతుంటే అంతా నవ్వారు.

'బి' అక్షరంలో భిక్షపతి, బెనర్జీ ఉన్నారు. భిక్షపతి కాగితంలో 'ఒకటి నుంచి వెయ్యిదాకా అంకెలు లెక్కపెట్టాలి' అని ఉంది. అతను తినడం మానేసి చెప్పాడు. అందులో శ్రమ తప్ప ఎవరికి వినోదం లేదు.

బెనర్జీకి వచ్చిన కాగితంలో 'గర్వం' అన్న పదం ఉపయోగించి ఓ గమ్మత్తయిన వాక్యం చెప్పాలి అని ఉంది.

"ఓ రెండు రెండు రోజులదాకా ఆలోచించుకోవచ్చు. ఫర్వాలేదు" చెప్పింది గాయత్రి అల్లరిగా

బెనర్జీ కొన్ని క్షణాలు ఆలోచించి చెప్పాడు.

"నేను నిగర్వినని చెప్పడానికి ఎంతో గర్వంగా ఫీలవుతున్నాను."

"వెరీగుడ్ సెంటెన్స్" వప్పుకుంది గాయత్రి వెంటనే.

ఆ తర్వాత రకరకాల అంశాలు.

"గుడ్డివాడు కాఫీ ఎలా కలుపుతాడో చేసి చూపించండి."

"అక్కినేని సినిమాల్లో ఆయన డైలాగ్ ఒకటి చెప్పండి."

"ఇక్కడున్న అందరికీ తలా పదిపైసలుఇవ్వండి."

"కుడికాలు చెప్పు ఎడం కాలికి, ఎడం కాలి చెప్పు కుడికాలికి ధరించి ఐదుగజాలు పరిగెత్తండి."

"మీరెంత వెర్రివెధవో విశదీకరించే కథ చెప్పండి."

"సన్నీ గవాస్కర్‌తో క్రికెట్ ఆటని ఆయన లేకపోయినా ఆడండి."

ఎవరికి వచ్చినవి వాళ్ళు మొహమాట పడకుండా చేసి చూపిస్తుంటే అంతా నవ్వారు.

మైత్రికి వచ్చిన కాగితంలో "పదిపైసల బిళ్ళని మీరు తప్ప అంతా చూడగలిగే చోట ఉంచండి" అని ఉంది.

అంతా ఆమె వంక చూస్తూ ఆలోచించారు అది ఎలా సాధ్యమా అని. మైత్రి కాసేపు ఆలోచించింది.

"ఓడిపోతే మిగతా పదమూడు మందికి తలా రూపాయి ఇవ్వాలి జాగ్రత్త" హెచ్చరించింది గాయత్రి.

మైత్రి తన హేండ్ బాగ్ లోంచి పదిపైసల నాణెం తీసి దాన్ని తన తలమీద ఉంచుకుంది.

నల్లటి జుట్టుమీద తెల్లటి పదిపైసల బిళ్ళ అందరికీ కనబడుతోంది.

ఓ కాగితంలో వాక్యం ఇలా ఉంది.

"మైత్రిని బెనర్జీ తన కుడిచేత్తో షేక్ హాండ్ ఇచ్చేలా చేయండి"

ఆ మాటలు వినగానే మైత్రి, బెనర్జీ వంక చురుగ్గా చూసింది. బెనర్జీకి ఆశ్చర్యం కలిగింది.

ఆ కాగితం వచ్చింది పుట్టినరోజుని సెలబ్రేట్ చేసుకునే ఐ.టి.ఓ. కొడుక్కే.

"మైత్రి. నీ చేతిని చాపు" అడిగాడతను.

మైత్రి తల అడ్డంగా తిప్పింది.

"నో. నో. ఇందులో రాసింది రాసినట్లుగా చేయాలి."

"మీరు చెయ్యాలి కాని నేను కాదు"

"అంతదాకా అన్ని కాగితాల్లో ఉన్నవి ఉన్నట్లుగా అంతా చేసారు"

"అది నాకొచ్చిన కాగితం కాదు."

"వారికి ఇష్టంలేనప్పుడు వద్దులెండి" చెప్పాడు బెనర్జీ.

వెంటనే పార్టీకి వచ్చిన వాళ్ళలో కొందరు షేక్ హాండ్ ఇవ్వాలని పట్టుపడితే కొందరు అక్కర్లేదన్నారు.

"కరచాలనం చేసినంత మాత్రాన ఏంకాదు. ఈ ట్వంటీ ఫస్ట్ సెంచరీలో మగా, ఆడ కరచాలనం చాలా సర్వసాధారణం" చెప్పాడు. ఐ.టి.ఓ. కొడుకు.

ఆఖరికి మైత్రి అందుకు ఒప్పుకుంది. నిరాకరిస్తే తను మరీ మొండిదానిగా అందరికీ కనబడతానని.

ఆమెకి ఆశ్చర్యం కలిగేలా బెనర్జీ అందుకు నిరాకరించాడు.

"ఆమెకి ఇష్టం ఉంటే మొదట కాగితం చదవగానే ఒప్పుకునేది. ఇంతమంది బలవంతం చేసాక కాని అంగీకరించలేదంటే, నా స్పర్శ మైత్రికి ఇష్టంలేదని స్పష్టంగా తెలుస్తోంది. అయాం సారీ. నేను కరచాలనానికి ఒప్పుకోను."

మళ్ళీ గొడవ మొదలయింది. బెనర్జీ మాత్రం తన పట్టువదల్లేదు.

"ఫర్వాలేదు" చెప్పింది మైత్రి తలవంచుకుని కుడిచేతిని చాపి.

"నాకు ఫర్వావుంది" చెప్పాడు బెనర్జీ.

ఒకరిద్దరు బలవంతం చేస్తే చెప్పాడు బెనర్జీ.

"టచ్ - మి - నాట్ అని ఓ అమ్మాయి నోటితో చెప్పనక్కరలేదు. మొక్కలతో, ఆకులతో కూడా చెప్పవచ్చు"

"మరయితే ఆ వాక్యం ఎందుకు రాశారు?" అడిగాడు ఐ.టి.ఓ కొడుకు.

బదులుగా చిన్నగా నవ్వాడు బెనర్జీ.

"ఆ కాగితం ఇటివ్వండి" చెప్పాడు.

దానికింద 'ఈ వాక్యం నేను రాయలేదు' అని రాసి దాన్ని మైత్రికి అందించాడు. రెండు చేతి వ్రాతల్లోని తేడాని గుర్తించింది మైత్రి.

బెనర్జీ చెప్పాడు.

"ఇక టాపిక్ వదిలేద్దాం.. మైత్రిగారూ నేను రెండు ప్రశ్నలు అడగమంటాను. ఆ రెంటిని అడగండి చాలు"

తల ఊపింది మైత్రి.

"మీరు డబల్ డెక్కర్ బస్సా అని అడగండి" చెప్పాడు బెనర్జీ.

ఆ ప్రశ్న అడిగింది మైత్రి.

"అవును. ఇప్పుడు మీరు సైకిలా అని అడగండి" చెప్పాడు బెనర్జీ.

"మీరు సైకిలా?" అడిగింది మైత్రి మళ్ళీ.

"కాదు. మీకు వేపకాయంత వెర్రి ఉన్నట్లుందే ఇప్పుడే చెప్పాగా నేను డబల్ డెకర్ బస్ అని" ఆ ప్రశ్నకు సమాధానం చెప్పాడు బెనర్జీ.

అంతా గట్టిగా నవ్వారు.

"గుడ్ ఇలా మనం నవ్వుకోవాలి కాని ఇందాకటిలా కరచాలనం చెయ్యాలని లేదా చెయ్యకూడదని వాదించుకోడానికి కాదుగా ఇక్కడికి వచ్చింది.

గాయత్రి వెంటనే చెప్పింది.

"మీ అందరితో ఓ పందెం. ఓడిపోయినవారు తలో రూపాయి ఇవ్వాలి. మొదట గెలిచిన వారికి నేనో రూపాయి ఇస్తాను."

"సరే" చెప్పారంతా!

"మీ పదమూడు మందిలో ఎవరూ గెలవలేరు. మీ ఎడం అరచేతిని కుడి అరచెయ్యి అందుకోలేని చోట ఉంచండి. సరిగ్గా మూడు నిమిషాలు గడువు"

గడియారాన్ని చేతినించి తీసి పట్టుకుని దానివంక చూడసాగింది గాయత్రి.

అందరూ ఎడం అరచేతిని రకరకాల ప్రదేశాలలో ఉంచడానికి ప్రయత్నించసాగారు. ఒకరు చేతిని వీపు మీదకు తీసుకు వెళితే కొందరు పూర్తిగా పైకెత్తి కుడి అరచేయి అందుకోగలదేమో ప్రయత్నించసాగారు. దూరం నుంచి చూసేవారికి అది ఎంతో విచిత్రంగా ఉంది. అంతా తమ రెండుచేతులని రకరకాల భంగిమలలో ఉంచడం. మూడు నిముషాల తర్వాత చెప్పింది గాయత్రి.

"టైమయిపోయింది"

అంతా ఆమె వంక ఆసక్తిగా చూసారు. గాయత్రి తన ఎడం అరచేత్తో కుడి మోచేతిని పట్టుకుంది.

"ఈ పొజిషన్‌లో ఉంటే కుడి అరచేత్తో ఎడం అరచేతిని తాకటం దుర్లభం" చెప్పింది.

వెంటనే అంతా ఆ ప్రకారం చేతుల్ని ఉంచి చూసుకున్నారు.

"నిజమే" చెప్పాడు బెనర్జీ నవ్వి.

"తీయండి డబ్బు"

అంతా తలో రూపాయి గాయత్రికి ఇచ్చారు.

సాయంత్రం నాలుగన్నరదాకా వర్డ్ బిల్డింగ్, అంత్యాక్షరి లాంటి ఆటలు ఆడుతూ గడిపారు. బెనర్జీకి ఆ తరహా పార్టీ అదే మొదటిసారి కాబట్టి ఎంతో ఎక్సయిటింగ్‌గా ఉంది. అంతదాకా అతని ఉద్దేశంలో ఆనందానికి డెఫినిషన్ వైన్, విమెన్. ఇంకో రకం ఆనందం ఉంటుందని అప్పుడే తెలుసుకున్నాడు.

పార్టీ అయాక అంతా బయలుదేరారు. మైత్రి పక్కకి వెళ్ళి చెప్పాడు.

"మీరొస్తారని తెలిస్తే వచ్చేవాడిని కాను. సారీ"

"నేను వస్తే మీరెందుకు రాకూడదు?"

"లాజ్‌వంతి చెప్పింది కనుక"

మైత్రి కొంతసేపు మౌనంగా ఉండి తర్వాత చెప్పింది.

"మీ అంతస్తు వేరు. నాది వేరు. అనవసరపు భ్రమలు పెంచుకుని కష్టాలు కొని తెచ్చుకోవడం ఎవరికీ ఆరోగ్యం కాదు,"

"ఐథింక్ ఐయామ్ ఇన్ లవ్ విత్ యూ" చెప్పాడు బెనర్జీ.

"అది నాకు అర్థం అయింది కాబట్టే లాజ్‌వంతి పంపాను ప్రేమ అనేది పాసింగ్ ఎపిసోడ్"

"పాసింగ్ ఎపిసోడ్ కావచ్చు. కాని కాకపోవచ్చుకూడా."

అంతా బయటికి వచ్చాక అడిగాడు బెనర్జీ.

"మనం మరోసారి కలుద్దాం. రేపు సాయంత్రం ఇదే టైముకి మీ ఇంటికి రానా?"

"మా ఇంటికి మీరు రావడం నాన్నగారికి ఎంత మాత్రం ఇష్టంలేదు. "

"ఆయనకి నేనంటే ఎందుకంత కంటగింపు?"

"ఒకటి పెళ్ళి కావలసిన పిల్లలం ఇద్దరం ఆ ఇంట్లో ఉన్నాం. రెండు మీ నాన్నగారికి ఇన్‌సులిన్ ఇంజెక్షన్స్ ఇవ్వడానికి కాంపౌండర్ అవసరం ఉందని మీరు అబద్ధం చెప్పి మా ఇంటి చిరునామా సంపాదించారు. ఒకటి, ఒకటి కలిపి ఆలోచిస్తే రెండు స్ఫురించడం సహజమేగా."

తలపంకించాడు బెనర్జీ.

"రేపు సాయంత్రం కాదు. మనం ఎప్పటికీ కలవద్దు. ప్లీజ్ నాకీ సాయం చెయ్యండి" చెప్పింది మైత్రి.

విశ్వం, గాయత్రి, బెనర్జీ మరో ముగ్గురు అతని కారులో నెహ్రూ జూ పార్క్ నుంచి బయలుదేరారు. మైత్రి ఆర్.టి.సి. బస్‌లో మిగతా వాళ్ళతో కలిసి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి మైత్రి తన అక్క ధాత్రికి చెప్పింది పార్టీ విశేషాలు. పార్టీలో జోక్స్, క్విజ్‌లు మొత్తం వివరించింది మైత్రి. మాటల్లో బెనర్జీ గురించి చెప్పింది.

"అతనెలా వచ్చాడు?" అడిగింది ధాత్రి.

"గాయత్రి కజినట విశ్వం."

"ఓహో.. నువ్వంటే అతనికి ఎంతో ఇష్టంకదూ?" అడిగింది ధాత్రి నవ్వుతూ.

"ఇష్టంకాదు. ఇందాక ప్రేమ అని చెప్పాడు."

"నువ్వేం చెప్పావ్?"

"ఏం చెప్పి ఉంటాను?" అడిగింది మైత్రి. "ఎన్.ఓ.నా"

"యు.ఎన్.ఓ.నే."

"డబ్బున్నవాడు , ఎంచక్కా పెళ్ళిచేసుకోమంటే సరిపోయేది."

"అతని గురించి మనకేం తెలుసని? పెళ్ళికి సమవుజ్జీలం కాదు కదా..! "

ధాత్రి నవ్వింది.

"రేపు సాయంత్రం కలుసుకోమన్నాడు. ఒక్కసారి చాలట మళ్ళీ ఎన్.ఓ.నే చెప్పాను."

"మొల్లోతు ప్రేమలో ఇరుక్కున్నాడన్నమాట " మళ్ళీ నవ్వింది ధాత్రి.

"ఏమాటకామాటే చెప్పాలి. నువ్వు చేసిన చామదుంపల కూర ఎంత అద్భుతంగా ఉందనుకున్నావ్?" చెప్పింది మైత్రి.

ఆ తర్వాత టాపిక్ బెనర్జీ మీద నుంచి ఇతర విషయాల మీద వెళ్ళిపోయింది.

●●●

బెనర్జీతో చెప్పాడు ఆ రోజు ఉదయం అతని తండ్రి కారులో ఆఫీస్‌కి వెళుతూ - "మన పేకింగ్ సెక్షన్ లో నీలోత్పలి నిన్న నన్ను కలిసింది. "

బెనర్జీ గుండెల్లో రాయి పడ్డట్లయింది. మాట్లాడలేదు.

ఆయన కాసేపు మౌనంగా ఉండి తర్వాత అడిగాడు.

"నీకు బెనర్జీ అన్న పేరు ఎందుకు పెట్టానో తెలుసా?"

దానికి బదులు చెప్పలేదు బెనర్జీ.

"భారతదేశంలో గొప్పవాళ్ళు బెంగాల్‌లోనే ఎక్కువగా ఉన్నారు. జాతీయగీతం రాసిన ఠాగూర్, నవలాకారుడు శరత్, బంకించంద్ర చటర్జీ.. నువ్వూ వాళ్ళలా గొప్పవాడివవ్వాలన్న అభిమానంతో పెట్టాను. గోపాలకృష్ణుడు అన్న పేరు పెట్టకపోయినా నీ బుద్ధులు అలా ఉన్నాయి."

బెనర్జీ పెదవి విప్పలేదు.

"నీలోత్పలి కూతుర్ని మభ్యపెడుతున్నావు. మన వంశంలో పెళ్ళికాకుండా పరాయి స్త్రీని అలా చేయటం నీతోనే మొదలు."

బెనర్జీ తలవంచుకున్నాడు.

"ఇవాళ సాయంత్రం నీకు పెళ్ళిచూపులు. పేరు అనసూయ మంచి కుటుంబం. తండ్రి పోలీస్ ఆఫీసర్, నాకు మంచి మిత్రుడు. సరేనా?" అడిగాడాయన.

"............"

"నిన్నిప్పుడో ప్రశ్న అడిగాను" కఠినంగా చెప్పాడు బెనర్జీ తండ్రి.

"సరే నాన్నగారు."

"ఫేక్టరీనుంచి సరాసరి వెళదాం. మీ అమ్మకూడా వాళ్ళింటికి ఆరున్నరకి వస్తుంది. ఈ పెళ్ళి చూపులు కేవలం సాంప్రదాయం కోసమే. ముహూర్తాలు త్వరలో పెట్టుకుంటున్నాం."

బెనర్జీ నోరెత్తలేదు. ఆ సాయంత్రం పెళ్ళిచూపులయ్యాయి. అనసూయ అందంగానే ఉండటంతో బెనర్జీ నో అనలేదు. జాతకాలనిబట్టి ముహూర్తం నిర్ణయించాలని, మంచిరోజు చూసి నిశ్చితార్థం చేయాలని పెద్దలు మాట్లాడుకుంటుంటే బెనర్జీ మౌనంగా ఉండిపోయాడు.

"ఆ అమ్మాయి ఎంత నిదానస్తురాలో. అందంగా కూడా ఉంది. సుఖపడతావ్" బెనర్జీ తల్లి చెప్పింది ఇంటికి తిరిగివెళుతుంటే.

"అదే నేనూ ఆలోచించింది. భార్య గయ్యాళి అయితే భర్త విడాకులిస్తాడు. లేదా వేదాంతి అవుతాడు. ఈ రెండు వీడు జీవితంలో ఫేస్ చేయక్కర్లేదు" నవ్వాడు బెనర్జీ తండ్రి.

●●●

ఆ రోజు రాత్రి మైత్రి తండ్రి సుబ్బరామయ్యకి విపరీతమయిన దగ్గు, ఆయాసం అచ్చాయి. ఆయన ఊపిరి పీల్చుకోడానికే బాధపడేంతగా ఆయాసపడసాగాడు. ఆయనకి ఉబ్బసం వ్యాధి ఉంది. తరచూ వస్తూంటుంది. మందులు వేసుకుంటూంటాడు. తగ్గుతుంది.

ఆ రాత్రి ఆయన ఇంజక్షన్ చేసుకున్నా తగ్గలేదు. ధాత్రి అప్పటికప్పుడు పక్కింటినుంచి డాక్టర్‌కి ఫోన్ చేస్తే ఆయన వచ్చి చూసాడు. "హైదరాబాద్‌లో ఈ చలికాలం చలి ఎక్కువగా ఉంది. చలి తక్కువగా ఉండే గుంటూరులాంటి ఊరుకి వెళ్ళడం మంచిది. ఇది చలివల్ల కలిగిన అలర్జీకి వచ్చిన ఉబ్బసం" పరీక్షించి చెప్పాడాయన.

ఓ ఇంజక్షన్ ఇచ్చి చెప్పాడు. "ఈ మందులు తాత్కాలికంగా పనిచేస్తాయి తప్ప వ్యాధిని నివారించలేవు ప్రదేశం మారడమే మంచి మందు"

మైత్రికి, ధాత్రికి తెలుసు నెలన్నర, రెండు నెలలపాటు ఉద్యోగానికి శెలవు పెట్టి మరో ఊరు వెళ్ళి ఉండగల ఆర్ధిక స్తోమత తమ తండ్రికి లేదని. కాని ఆయన దగ్గుతో, కఫంతో, ఆయాసంతో పడే మరణ వేదనని చూడలేకపోతున్నారు. అమ్మడానికో, తాకట్టు పెట్టడానికో వాళ్ళ వంటి మీద బంగారం కూడా లేదు.

తెల్లవారు ఝామున ధాత్రి చెప్పింది మైత్రితో.

"నువ్వోపని చేయరాదు?"

"ఏమిటి?"

"అప్పు తీసుకోరాదు?"

"ఎవరిస్తారు? డాక్టరుగారు ఎంత పిసినారో తెలుసుగా."

"అతనున్నాడుగా"

"ఎవరు?"

"అతని పేరేమిటి? ఛటర్జీనా?"

"బెనర్జీ గురించా నువ్వు మాట్లాడేది? బావుండదు."

"నన్ను ప్రేమిస్తున్నాడట. నేను నో అన్నాను. అక్కడితో ఆ పరిచయం ముగియాలి."

మర్నాడు ఉదయం చెప్పింది మైత్రి ధాత్రితో.

"రాత్రి నువ్వు చెప్పింది ఆలోచించాను. అవసరం మనది కాబట్టి అడగడంలో తప్పులేదు. కాని మనసు అంగీకరించడం లేదే"

"ఇప్పుడు నిన్ను కాసేపు బ్రెయిన్ వాష్ చేస్తాను తర్వాత నువ్వే నిర్ణయించుకో అడగాలా, వద్దా అని. మనకి నాన్నగారు ఏమేం చేసారో గుర్తుందా?"

✷✷✷

*(ఇంకా ఉంది)*

Post your comments